# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- కార్యకర్త కుటుంబానికి పార్టీ బీమా చెక్కు అందజేత

జగిత్యాల, మార్చి 9: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌కు చెందిన అంతడుపుల నవీన్ రోడ్డు ప్రమాదంలో మరణించగా, పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును తండ్రి ప్రసాద్, కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సంజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని పార్టీ కాపాడుకుంటుందని, 60 లక్షల కార్యకర్తల సభ్యత్వంతో రాష్ట్రంలోనే అతిపెద్ద పార్టీగా బీఆర్ఎస్ ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 53 వేల మందికి ప్రమాద బీమా కల్పించిన ఘనత బీఆర్ఎస్‌దేనని, యువ నాయకుల మరణం చాలా బాధాకరమని వాపోయారు. ప్రతి ఒక్క యువకుడు బైక్ నడిపే సందర్భంలో హెల్మెట్ ధరించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ నాయకులు కేసీఆర్‌కు, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహేశ్, రూరల్ ఎంపీపీ మహేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, సీనియర్ నాయకులు కాసిం, వెంకటి, కో-ఆప్షన్ కుతుబుద్దీన్, మాజీ సర్పంచ్ మహేశ్వర రావు, నాయకులు, శ్రీనివాస్, రాజు, భూమన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబసభ్యుడికి బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

# కొండగట్టు ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తా

- ఓవర్‌లోడ్, న్యూట్రల్ గేర్‌లో ప్రయాణం
- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో
- 11 మందికి గాయాలు
- క్షతగాత్రులంతా మంచిర్యాల జిల్లా మ్యాదిరిపేట వాసులు

జగిత్యాల ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మల్యాల, మార్చి 9: కొండగట్టు ఘాట్‌రోడ్డులో ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో 11 మందికి గాయాలయ్యాయి. స్థానికులు, మల్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన గంధం జగన్, కుటుంబసభ్యులతో కలిసి తన ట్రాలీ ఆటోలో శుక్రవారం రాత్రి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి దర్శనానికి వచ్చాడు. రాత్రి ఆలయ పరిసరాల్లో బస చేసిన జగన్, కుటుంబసభ్యులు శనివారం వేకువజామున స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులందరూ ట్రాలీ ఆటోలో ఎక్కి ఘాట్‌రోడ్డు మార్గంలో కొండ కిందికి వచ్చేందుకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో 11 మందిని ఎక్కించుకోవడంతో (ఓవర్‌లోడ్ అవడంతో) పాటు వాహనాన్ని న్యూట్రల్‌లో నడిపాడు. దీంతో అదుపు తప్పిన ఆటో అతివేగంగా కిందికి రావడంతో పాటు రోడ్డుకిరువైపులా కట్టిన సైడ్‌వాల్ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆటోలో ఉన్న జగన్‌తో పాటు కుటుంబసభ్యులందరికీ గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు '108'కు ఫోన్ చేసి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు డయల్ 100 ద్వారా మల్యాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ అబ్దుల్ రహీం క్షతగాత్రులను చికిత్స కోసం జగిత్యాల జిల్లా దవాఖానకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. కాగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దవాఖానకు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.

ప్రమాదానికి గురైన ట్రాలీ ఆటో

### నిబంధనలకు విరుద్ధంగా వాహనాల రాకపోకలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానానికి వెళ్లే ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం రాకపోకలను నిలిపివేసింది. సంబంధిత శాఖల అధికారులు పరిశీలించిన అనంతరం రోడ్డు మార్గంలో పలు రక్షణ చర్యలు చేపట్టింది. ప్రత్యేక నిబంధనలతో ఘాట్‌రోడ్డు గుండా రాకపోకలను సాగించేందుకు అనుమతించింది. ఇందులో ప్రధానంగా ఘాట్ రోడ్డు మార్గంలో కేవలం లైట్ మోటార్ వెహికిల్స్ మాత్రమే ప్రయాణించాలని, వాటితో పాటు గంటకు 20 కిలోమీటర్లకు మించి వేగం లేకుండా, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణించవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయినప్పటికీ పలు ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం వల్ల ఘాట్‌రోడ్డులో భారీ వాహనాలు సైతం రాకపోకలు కొనసాగిస్తున్నాయి.

పోరుమల్లలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో యాద రామకృష్ణ, విద్యార్థులు

## విద్యార్థి దశ కీలకమైంది

మేడిపల్లి, మార్చి 9: విద్యార్థి దశ కీలకమైందని, సమయాన్ని సక్రమమైన మార్గంలో వినియోగించుకోవాలని రామకృష్ణ, ఎన్ఎస్‌వీ డిగ్రీ, పీజీ కళాశాల అధినేత యాద రామకృష్ణ సూచించారు. మండలంలోని పోరుమల్లలో జిల్లా కేంద్రానికి చెందిన రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శనివారం ఉదయమే వలంటీర్లు గ్రామస్తుల చేత యోగా చేయించారు. ఓంకారేశ్వర, నందీశ్వరాలయంలో నిర్వహిస్తున్న అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, ఎన్ఎస్‌వీ అధ్యాపకులు చైతన్య, రఘునాథ్, ఎన్ఎస్ఎస్ పీవోలు అప్సర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'జీరో టిల్లెజ్' మక్కజొన్న సాగు పరిశీలన

మక్కజొన్న సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి

జగిత్యాల రూరల్, మార్చి 9: వరి మాగాణుల్లో దుక్కి దున్నకుండా జీరో టిల్లెజ్ విధానంలో సాగు చేసిన మక్కజొన్నను జిల్లా వ్యవసాయాధికారి వాణి పరిశీలించారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన బద్దం రాజేందర్ రెడ్డి జీరో టిల్లెజ్ విధానంలో సాగు చేస్తున్న మక్కజొన్నను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వానాకాలం వరి పంట కోసిన తర్వాత యాసంగిలో తిరిగి వరిని సాగు చేయడానికి సరిపడా నీళ్లు లేని భూమిలోని తేమ, పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి రైతులు ఈ విధానాన్ని అనుసరించాలన్నారు. ఈ విధానంలో 60.20 సీ.ఎం. దూరం ఉండేలా మక్కలను విత్తుకోవాలని సూచించారు. తక్కువ కూలీలు, తక్కువ ఖర్చుతో రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. జీరో టిల్లెజ్ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

# సభను విజయవంతం చేయండి

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో 'కదనభేరి'
- ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహణ
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల, మార్చి 9: ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించే కదనభేరికి ప్రతి ఒక్కరూ కదిలిరావాలని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని శ్రేణులకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మల్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నాయకులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై, మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్‌కు మద్దతుగా అధినేత కేసీఆర్ ఉద్యమగడ్డ నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నారని, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొండపలుకుల రాంమోహన్‌రావు, సహకార సంఘాల అధ్యక్షులు అయిల్నేని సాగర్‌రావు, బీ మధుసూదన్‌రావు, నాయకులు జనగం శ్రీనివాస్, మిట్టపల్లి సుదర్శన్, తైదల శ్రీలత, భూపతిరెడ్డి కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

### 'కదనభేరి'కి కదిలిరండి

కొడిమ్యాల, మార్చి 9: కరీంనగర్‌లో నిర్వహించే కదనభేరి సన్నాహక సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నాచుపల్లిలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధ్వర్యంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 12న కరీంనగర్‌లో, పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించే కదనభేరి సన్నాహక సమావేశానికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హాజరవుతున్నట్లు చెప్పారు. భారీ బహిరంగ సభ నిర్వహిస్తుండడంతో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా సభకు కార్యకర్తలను తరలించడంపై చర్చించారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, మండల నాయకులు పునుగోటి కృష్ణారావు, మెన్నేని రాజనర్సింగరావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: బీఆర్ఎస్ నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎన్నికల ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి

## ఎన్నికల కోడ్‌కు ముందే డీఏ ప్రకటించాలి

- స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా శాఖ డిమాండ్

మాట్లాడుతున్న బైరం హరికిరణ్

జగిత్యాల, మార్చి 9: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ప్రకటించక ముందే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావల్సిన 4 డీఏలను వెంటనే ప్రకటించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శనివారం ఎస్టీయూ భవన్‌లో జిల్లా శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ మాట్లాడారు. రెండేళ్లుగా కేంద్రం డీఏలు ప్రకటించినప్పటికీ, తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు డీఏలు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కోర్టు కేసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వేసవిలోనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## తిప్పన్నపేటలో ఆటోడ్రైవర్ల ఆందోళన

జగిత్యాల రూరల్, మార్చి 9: మండలంలోని తిప్పన్నపేటలోని బస్టాండ్ వద్ద శనివారం ఆటోడ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఉచిత బస్సు పథకంతో తమ ఉపాధి కోల్పోతున్నామని, ఆటోల్లో ఎవరూ కూడా ప్రయాణం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు ఖాళీగా పెట్టుకుని కూర్చుంటున్నామని, దీంతో తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు చింతకుంట గంగాధర్, వెంకటేశ్, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి

- ప్రభుత్వ విప్‌నకు మూడు గ్రామాల ప్రజల వినతి

పెగడపల్లి, మార్చి 9: ఏడుమోటలపల్లి, రాంబద్దునిపల్లి, ల్యాగలమర్రి గ్రామాలకు, జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్, యూత్ నాయకులు కోరారు. శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పెగడపల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో తమ గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండగా, దాన్ని రద్దు చేశారని, దీని వల్ల మండల, జిల్లా కేంద్రానికి వెళ్లి రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ విప్ వెంటనే జగిత్యాల డీఎంకు ఫోన్‌లో సమస్యను వివరించారు. సమస్య పట్ల డీఎం సానుకూలంగా స్పందించారని, వెంటనే సర్వే చేయించి బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పినట్లు లక్ష్మణ్ కుమార్ వారికి వివరించారు.

## మౌనికను సన్మానించిన ప్రభుత్వ విప్ ఆది

మౌనికను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 9: చింతకుంటకు చెందిన దుగ్గిళ్ల మౌనిక గురుకుల పాఠశాల టీచర్‌గా (టీజీటీ-బయోలాజికల్ సైన్స్) ఎంపిక కావడంతో శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సన్మానించారు. గ్రామానికి చెందిన దుగ్గిళ్ల మల్లయ్య, రాజు దంపతుల కూతురు మౌనిక కష్టపడి చదివి ఇటీవల ప్రకటించిన గురుకుల టీచర్ జాబితాలో రాష్ట్రంలో 29వ ర్యాంక్, జోన్-2లో 2వ ర్యాంక్ సాధించింది. మౌనికను అభినందించి, అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రాజం, మల్లయ్య, దేవయ్య, మల్లేశం, మల్లయ్య, నర్సారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆయకట్టుకు సాగు నీరు విడుదల

జగిత్యాల టౌన్, మార్చి 9: కాకతీయ కెనాల్ ద్వారా జోన్-2 ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 18న ఉదయం 6 గంటల వరకు కాకతీయ కెనాల్ ద్వారా జోన్-2 ఆయకట్టుకు సాగునీరు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున జోన్-1 పరిధిలోని అన్ని తూములను ఆదివారం ఉదయం 6 గంటల్లోగా పూర్తిగా మూసివేసి ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకతీయ కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున కాలువ దరిదాపుల్లోకి సామాన్య జనం ఎవరూ రావద్దని, ప్రమాదానికి గురికావద్దని హెచ్చరికలు జారీ చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958-All

కోర్టు కేసులు

★మీరు మీ కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? ఎంత క్లిష్టమైన కేసులైనా తక్కువ Feesతో నమ్మకమైన లాయర్‌తో Solve చేస్తాం. GLS, L.B.నగర్, Hyd. 7893011777.
NT-311861-All

CHANGE OF NAME

★I, DUSA RANJITA PRABHAKAR, R/o. 3-93/2/A/1, Road No. 8, Revenue Colony, Theegalaguttapally, Karimnagar, TS. Changed My Name as ANMANDLA RAMYASREE, W/o. Munendar Prasad.
NT-319479

★I, TIKKALA NAGARAJU, S/o. Tikkala Limbaiah, R/o. 1-116, Marrimadla, Rajanna Sircilla, TS. have Changed My Name as THIKKALA NAGARAJU, S/o. Thikkala Limbaiah.
NT-319479

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

- ఘనంగా స్వామి వారి రథోత్సవం

ధర్మపురి/కోరుట్ల/పెగడపల్లి/మేడిపల్లి/గొల్లపల్లి/కోరుట్లరూరల్/రాయికల్/మల్లాపూర్/కథలాపూర్, మార్చి 9: జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో శుక్రవారం రాత్రి, శనివారం వేకువజామున శివపార్వతుల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అందంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను ఉంచి ఊరేగించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. కల్యాణం అనంతరం పలు ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన రామలింగేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి 2గంటలకు శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం శనివారం వేకువజామున 4గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. పట్టణ శివారులోని అక్కపెల్లి రాజేశ్వరాలయంలో శనివారం వేకువజామున రథోత్సవం నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, దేవస్థానం రెనోవేషన్ కమిటీ సభ్యుడు రామన్న, అక్కపెల్లి రాజేశ్వరాలయం చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు. కోరుట్లలోని పురాతన మహాదేవ స్వామి, శివ మార్కండేయ కోటి నవదుర్గా, నగరేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. కూచిపూడి నృత్య కళాకారులు చేసిన సాంస్కృతిక నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. పెగడపల్లిలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి లింగోద్భవ దర్శనం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వెంగళాయిపేట శివాంజనేయస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు చేపట్టారు. మేడిపల్లి, భీమారం, పోరుమల్ల, కట్లకుంట, తోంబర్‌రావుపేట, కొండాపూర్, వల్లంపల్లి, దమ్మన్నపేటలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పోరుమల్లకు చెందిన లక్కం మల్లవ్వకు పట్టుచీరను బహూకరించారు. జడ్పీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు, ఎంపీపీ ఉమాదేవి స్వామివారిని దర్శించుకున్నారు. గొల్లపల్లి మండలంలోని రాపల్లి, లొత్తునూర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో పూలమాలలతో అలంకరించిన రథంపై శివపార్వతులను ఉంచి రథోత్సవం కనుల పండువలా నిర్వహించారు. కోరుట్ల రూరల్ మండలం యూసుఫ్‌నగర్‌లోని శివాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. రాయికల్‌లోని పంచముఖ లింగేశ్వరస్వామి (త్రికుటాలయం) ఆలయంలో రథో త్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మల్లాపూర్‌లోని కనక సోమేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. అనంతరం అన్నదానం చేశారు. జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ-2 సత్తమ్మ, దేవదాయ కమిటీ అధ్యక్షుడు గంగరాజం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కథలాపూర్ మండలం పోతారంలోని లొంకరామేశ్వరస్వామి, అంబారిపేటలోని ఓంకారేశ్వరస్వామి, చింతకుంటలోని తారకేశ్వరస్వామి, భూషణరావుపేటలోని శివాలయం, గంభీర్‌పూర్‌లోని శివాలయంలో స్వామి వారి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

కోరుట్ల: మార్కండేయ ఆలయంలో తాళి బొట్టు చూపుతున్న అర్చకుడు, నృత్యం చేస్తున్న కూచిపూడి కళాకారులు

ధర్మపురి: రామలింగేశ్వరాయలంలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెగడపల్లి: స్వయంభూ రాజరాజేశ్వర ఆలయం వద్ద నిర్వహిస్తున్న స్వామివారి రథోత్సవం

## కిటకిటలాడిన దుబ్బ రాజన్న ఆలయం

సారంగాపూర్, మార్చి 9: బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేద పండితులు అన్నపూజను నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారికి అన్నపూజ, అభిషేకం, కోడె మొక్కు, కేశ ఖండనం, కుంపటి, గజాశూలం, గండ దీపం, బెల్లం తదితర మొక్కులను చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం స్వామి వారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో అనూష, ట్రస్టు ఫౌండర్ శంకరయ్య తెలిపారు. బీర్‌పూర్ మండలం తుంగూర్‌లోని గుట్ట రాజరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేశ్వరి, మాజీ సర్పంచ్ శ్రీమతి, ఆలయ చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

దుబ్బ రాజన్న ఆలయం గర్భగుడిలో స్వామివారికి అన్నపూజ చేస్తున్న అర్చకుడు, భక్తుల సందడి

## పెగడపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాంరెడ్డి

పెగడపల్లి, మార్చి 9: పెగడపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాంరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి నెల రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో గొల్లపల్లి ఎంపీడీవో రాంరెడ్డికి ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ, జడ్పీ సీఈవో శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## రామాలయంలో హుండీ చోరీ

కథలాపూర్, మార్చి 9: మండలంలోని భూషణరావుపేట శివారులోని రామాలయంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం రాత్రి రామాలయంలోకి చొరబడిన దొంగలు హుండీని ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. హుండీలో సుమారు మూడు నెలలుగా భక్తులు వేసిన కానుకలు, నగడు ఉన్నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించారు.

## నిత్యావసర సరుకులు అందజేత

కోరుట్ల, మార్చి 9: పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గంగాధర్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులకు కాంగ్రెస్ సేవాదళ్ ఇన్‌చార్జి భూమాచారి నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రంగయ్య, శేఖర్, అనిల్, రాజేంద్రప్రసాద్, నాయకులు తదితరులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొడిమ్యాల, మార్చి 9: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకునట్లు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.